# 4 కోట్ల ప్రజల భావోద్వేగం కేసీఆర్

- పదవులను త్యజించి.. ఢిల్లీ పీఠాన్ని కదిలించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కారణజన్ముడు
- ఆయన జన్మదినం అందరికీ పండుగ దినం
- కేసీఆర్ నాయకత్వంలో పనిచేయడం అదృష్టం
- అన్నివర్గాల వారు ఆయననే కోరుకుంటున్నరు
- కేసీఆర్ బర్త్‌డే వేడుకల్లో మాజీ మంత్రి హరీశ్



హైదరాబాద్, ఫిబ్రవరి 17 (నమస్తేతెలంగాణ): 'అవమానాలను భరించి.. పదవులను గడ్డిపోచలా త్యజించి.. ఢిల్లీ పీఠాన్ని కదిలించి తెలంగాణను తెచ్చింది కేసీఆరే' అంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. ఆయన ఒక వ్యక్తికాదని, నాలుగుకోట్ల తెలంగాణ ప్రజల భావోద్వేగమని అభివర్ణించారు. ఆ కారణజన్ముడి జన్మదినం మనకందరికీ పండుగ దినమని పేర్కొన్నారు. 'ఆ మహానుభావుడు పుట్టినరోజు ఫిబ్రవరి 17కు ఎంతటి ప్రాధాన్యమున్నదో.. తెలంగాణ వచ్చుడో..కేసీఆర్ సచ్చుడో.. అయితే తెలంగాణ జైత్రయాత్ర..లేదంటే నా శవయాత్ర అని ప్రతినబూని ఆమరణదీక్షకు పూనుకున్న నవంబర్ 29కి కూడా అంతే ప్రాధాన్యమున్నది' అని చెప్పారు. సోమవారం తెలంగాణభవన్‌లో నిర్వహించిన కేసీఆర్ బర్త్‌డే వేడుకల్లో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పుట్టిన రెండేళ్లకే కాంగ్రెస్ 1956లో తెలంగాణను ఆంధ్రాలో కలిపిందని గుర్తుచేశారు. ఆయన పదహారేండ్ల వయస్సులోనే 1969 తొలి తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని గుర్తుచేశారు. ఆయనకు ఆంధ్రాపార్టీల్లో పనిచేసినా నిత్యం తెలంగాణ ప్రయోజనాల కోసమే పరితపించారని తెలిపారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని ఎత్తిచూపేవారని పేర్కొన్నారు. చంద్రబాబు పాలనలో పెంచిన విద్యుత్తు చార్జీలు తెలంగాణ ప్రజల పాలిట ఉరితాళ్లని నిలదీశారని, తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను భరించలేకే వందలు, వేల గంటల పాటు మేధోమథనం చేసి ప్రత్యేక ఉద్యమానికి శ్రీకారంచుట్టారని గుర్తుచేశారు. ఎవరు జై తెలంగాణ అన్నా పదవి కోసమే అనే అపవాదు ఉన్నరోజుల్లో, డిప్యూటీ స్పీకర్, పార్టీ కార్యదర్శి, ఎమ్మెల్యే పదవులను వదిలిపెట్టి ప్రత్యేక పోరును తనదైన పంథాల్లో ముందుకు తీసుకెళ్లారని, అందుకే ఆయన చిత్తశుద్ధిని జయశంకర్‌సార్‌తో పాటు అనేక మంది మేధావులు ప్రశంసించేవారని తెలిపారు. 2001 నుంచి ఆ మహోన్నతుడి నాయకత్వంలో పని చేసే అవకాశం తనకు కలుగడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు.

### మొండిపట్టుదలతో రాష్ట్ర సాధన

ఉద్యమసమయంలో అనేకమంది నాయకులు వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డా కుంగిపోకుండా పట్టుదలతో రాష్ట్రాన్ని సాధించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని హరీశ్ కొనియాడారు. కేసీఆర్ నాడు పదవులకు ఆశపడో.. అధైర్యపడో వెనుకడుగు వేసి ఉంటే ఈ రోజు మనం తెలంగాణలో ఉండకపోయేవాళ్లమని చెప్పారు. కేసీఆర్ ప్రాణత్యాగానికి సిద్ధమైన ఫలితంగానే కాంగ్రెస్ 2009 డిసెంబర్ 9న తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ మధ్యలో దోఖాచేసినా వెరవకుండా పట్టుబట్టి ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన ధీశాలి కేసీఆర్ అని కీర్తించారు.

### పైసల కోసమే రేవంత్ 20-20 మ్యాచ్‌లు

మారిన రాజకీయ పరిస్థితుల్లో 20-20 మ్యాచ్‌లు ఆడుతున్నానని సీఎం రేవంత్ చెప్పడం విడ్డూరంగా ఉన్నదని, ఆయన పైసల కోసమే తొండి మ్యాచులు ఆడుతున్నారని హరీశ్ దుయ్యబట్టారు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనే చందంగా పదవిలో ఉండగానే కమీషన్లు, కలెక్షన్లకు తెరలేపారని దుయ్యబట్టారు. నీళ్ల విషయం, హామీల అమలులో తొండి మ్యాచ్‌లు ఆడుతున్న ఆయన, డబ్బులు కొల్లగొట్టడంలో మాత్రం 20-20 మ్యాచ్‌లు ఆడుతున్నారని ఎద్దేవాచేశారు. ఆయన ఏ మ్యాచ్ ఆడినా కేసీఆర్‌కు ఏ మ్యాచ్ ఆడాలో తెలుసని, టెస్ట్, వన్డే, ట్వంటీ ట్వంటీ ఏదైనా గొప్పగా ఆడగలిగే నైపుణ్యం కేసీఆర్ సొంతమని, అవసరమైతే డిఫెన్స్ అడతారని, సిక్స్ కొడతారని చమత్కరించారు. ఇప్పుడు కూలీ నుంచి రోడ్లమీద పోయేవారినెవరిని కదిలించినా కేసీఆరే రావాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు.

### తెలంగాణతో కేసీఆర్‌ది పేగుబంధం

పోరాడి సాధించిన తెలంగాణను కేసీఆర్ కంటికిరెప్పలా కాపాడుకున్నారని హరీశ్ చెప్పారు. పదేండ్ల పాలనలో అనుక్షణం ప్రజల కోసం పరితపించి రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దారని గుర్తుచేశారు. సాగు, తాగునీరు, కరెంట్ ఇలా అన్నింటా తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపారని కొనియాడారు. కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలకు ఉన్నది తల్లీబిడ్డల పేగుబంధమని అభివర్ణించారు. అందుకే ప్రతిక్షణం రాష్ట్ర అభ్యున్నతికోసం కేసీఆర్ పరితపిస్తుంటారని పునరుద్ఘాటించారు.



నల్లగొండ బీఆర్ఎస్ కార్యాలయ ఆవరణలో మొక్కనాటి నీళ్లు పోస్తున్న మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి, పక్కన మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, భూపాల్‌రెడ్డి, పార్టీనేత సుధాకర్



ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

# కేసీఆర్‌కు జన నీరాజనం

- ఎర్రవెల్లికి వెల్లువెత్తిన అభిమానం
- ఘనంగా జననేత బర్త్‌డే వేడుకలు
- నినాదాలతో మార్మోగిన పరిసరాలు
- గంటల తరబడి అభిమానుల శుభాకాంక్షలు స్వీకరించిన కేసీఆర్



తమ అభిమాన నేత కేసీఆర్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపేందుకు ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో బారులు తీరిన యువకులు

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు ఎర్రవెల్లి నివాసంలో ఘనంగా జరిగాయి. రాష్ట్రం నలుమూలల నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు జననేతకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు వేలాదిగా తరలివచ్చారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానుల కోలాహలంతో ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో సందడి నెలకొన్నది. వందలాది వాహనాలతో ఎర్రవెల్లి పరిసరాలు సోమవారం కిక్కిరిసిపోయాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు కేసీఆర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పేందుకు బారులు తీరడంతో ఎర్రవెల్లి ప్రాంగణమంతా గులాబీమయమైంది. అభిమానులు, కార్యకర్తలు ఉత్సాహంతో.. ఉద్వేగంతో నినాదాలు చేశారు. 'కేసీఆర్ జిందాబాద్, తెలంగాణ జిందాబాద్, కేసీఆర్ రావాలి, సీఎం కేసీఆర్' అనే నినాదాలతో ఆ ప్రాంగణమంతా మారుమోగింది. శ్రేణులను పలకరిస్తూ కేసీఆర్ నాలుగు గంటలపైనే నిరంతరాయంగా నిలబడి వారి తో ఫొటోలు దిగారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు.

### సర్వమత ఆశీర్వాదాలు..

కేసీఆర్‌కు సర్వమత పెద్దలు మహదాశీర్వచనాలు, వేదమూర్తుల మంత్రోచ్ఛరణాలతో ఆ ప్రాంగణం పవిత్రతను సంతరించుకున్నది. కుంభమేళా, తిరుపతి, యాదాద్రి, వేములవాడ సహా వివిధ పుణ్యక్షేత్రాల్లో మొక్కులు చెల్లించి, కానుకలు కట్టి, లడ్డూ ప్రసాదాలను తెచ్చి అభిమానం చాటుకున్నారు. ఎవరికి తోచిన రీతిలో వారు ప్రసాదాలను, పసుపు కుంకుమలు తెచ్చి అభిమాన నేతకు అందించేందుకు ఎర్రవెల్లికి పోటెత్తారు. కొంతమంది అభిమానుల వివిధరకాల సృజనాత్మక భావ ప్రకటన రూపాలను కేసీఆర్‌కు అందజేశారు. తమ అభిమానాన్ని చాటుకునేందుకు తన కోసం ప్రత్యేకించి తయారుచేసిన కళారూపాలను కేసీఆర్ స్వీకరించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, శాసనమండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్మన్లు సహా పార్టీ శ్రేణులు తండోపతండాలుగా తరలివచ్చారు. సాయంత్రం వరకు అభిమానుల తాకిడి పెరిగి, దూరతీరాల నుంచి వచ్చిన వారు సురక్షితంగా వారి వారి గమ్యస్థానాలకు వెళ్లాలనే ఉద్దేశంతో కేసీఆర్ ఇంటి పైనుంచి అందరికీ అభివాదం చేశారు. ఆ సమయంలో ఒక్కసారిగా కేరింతలతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. 'జై కేసీఆర్, హ్యాపీ బర్త్‌డే సార్, జై తెలంగాణ' అంటూ పెద్దపెట్టున చేసిన నినాదాలు మిన్నంటాయి.

### వందేండ్ల ముందుచూపు.. పుస్తకావిష్కరణ

ఆర్బీఐ తెలంగాణ ప్రగతి నివేదిక గణాంకాలతో జూలూరు గౌరీశంకర్ సంపాదకత్వంలో వెలువరించిన 'వందేండ్ల ముందుచూపు' పుస్తకాన్ని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సోమవారం ఆవిష్కరించారు. ఎర్రవల్లి నివాసంలో కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఈ పుస్తకాన్ని గౌరీశంకర్ కేసీఆర్‌కు అందజేశారు. కేసీఆర్ తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా దశాబ్ద కాలం పాటు కృషితో అందించిన ప్రగతి పాలనలో, రాష్ట్ర పునర్నిర్మాణంలో నీళ్లు, నిధులు, నియామకాలకు సంబంధించి బలమైన పునాదులు వేయగలిగారన్న అంశాలను అందులో పొందుపర్చినట్టు చెప్పారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, ఎమ్మెల్సీలు దేశపతి, తక్కెళ్లపల్లి, మాజీ మంత్రి మహమూద్ అలీ, రాజకీయ విశ్లేషకులు వీ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

### కేసీఆర్‌ను మళ్లీ సీఎం చేద్దాం

మొదటిపేజీ తరువాయి...

పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని భావోద్వేగానికి గురయ్యారు. సోమవారం మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కేసీఆర్ జన్మదినోత్సవానికి కేటీఆర్ హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం పెద్దసంఖ్యలో తరలివచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. అలుపెరగని పోరాటంతో ఉమ్మడి పాలకులను ఎదిరించి తెలంగాణను సాధించిన కారణజన్ముడు కేసీఆర్ అని కొనియాడారు. మనీ, మీడియా, మజిల్ పవర్‌లేకున్నా కులబలం అండగా లేకున్నా గుండెబలంతో 25 ఏండ్ల కిందటే తెలంగాణ రాష్ట్ర సమితిని ఏర్పాటు చేసి, తెలుగు రాష్ట్రాల రాజకీయాలను శాసించిన ధీశాలి కేసీఆర్ అని ఉద్ఘాటించారు. ఎన్ని అవమానాలు ఎదురైనా, ప్రతికూల ఫలితాలు వచ్చినా వెనుదిరిగి చూడకుండా చావునోట్లో తలపెట్టి తెలంగాణ కలను సాకారం చేసిన యోధుడని కీర్తించారు. 'మన మందరం రాబోయే మూడున్నరేండ్లు ఒకటే ప్రతిజ్ఞ తీసుకుందాం..ఆయన్ను ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా ముందుకెళ్లి మహానేతకు తెలంగాణను అప్పగిద్దాం' అని పిలుపునిచ్చారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా నిర్దేశించుకున్న లక్ష్యం కోసం కలిసికట్టుగా ముందుకెళ్దామని సూచించారు.




కరీంనగర్‌లో మొక్కలు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి గంగుల, నారదాసు




ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



జగిత్యాల జిల్లా కోరుట్లలో రక్తదానం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల



ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి



### ముగ్గురు చిన్నారుల పేరిట పోస్టల్ డిపాజిట్లు

ఇటీవల ఆత్మహత్య చేసుకున్న సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం గిరిపల్లి గ్రామానికి చెందిన రైతు బండారి రవీందర్ ముగ్గురు ఆరేండ్లలోపు కుమార్తెలకు కేసీఆర్ జన్మదినం సందర్భంగా గజ్వేల్ ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ ఆర్థికసాయం అందజేశారు. కేసీఆర్ 72వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న తరుణంలో రూ.24 వేల చొప్పున ముగ్గురికీ రూ.72 వేల పోస్టల్ డిపాజిట్ల బాండ్లను స్నేహిత, లౌక్యశ్రీ, రిశికకు అందజేశారు. చిత్రంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, బీఆర్ఎస్ నేత ఒంటేరు ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.





### చిన్నారి గొప్ప మనసు

జగద్గిరిగుట్ట ఫిబ్రవరి 17: కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకొని ఓ చిన్నారి వితరణతో తన గొప్ప మనసును చాటుకున్నది. రంగారెడ్డి నగర్‌కు చెందిన ఆలేటి సురేశ్ గౌడ్, సౌమ్య కుమార్తె హైత్విగౌడ్ చిన్ననాటి నుంచే కేసీఆర్‌పై అభిమానం పెంచుకున్నది. స్థానిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న హైత్విగౌడ్ తాను కిడ్డీ బ్యాంకులో దాచుకున్న రూ.5 వేలతో అదే స్కూల్‌కు మోటర్‌ను కొనిచ్చింది. దీంతో బాలికను పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక నేతలు అభినందించారు.



గద్వాల జిల్లా అలంపూర్‌లో కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి



కేసీఆర్ బర్త్‌డే సందర్భంగా మెదక్ జిల్లా నిజాంపేటలో కాంగ్రెస్ నాయకులకు చాక్లెట్లు పంచుతున్న సీపీఐ నాయకుడు బాలగౌడ్



నేరడిగొండలో రక్తదానం చేసిన దివ్యాంగుడు జంగు పోచన్నను అభినందిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



వనపర్తి జిల్లాలోని కూలీలకు మిఠాయిలు పంచుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



పెద్దపల్లి జిల్లా గోదావరిఖని జయదుర్గాదేవి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్